ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 31 | సంచిక : 9 | మే 2026

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

కరుణామయుడు గౌతమబుద్ధుడు .................... 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ....... 5

శ్రీమద్భగవద్గీత ......................................... 18

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



నువ్వు ఇతరులని ద్వేషిస్తూ ఉంటే నువ్వు విషం తాగుతున్నావని నీకు తెలియదు. ద్వేషం విషంతో సమానం. ఇతరులను ద్వేషించటం వల్ల నీ మనస్సు నెమ్మదిగా పొల్యూట్ అయిపోతుంది.

# కరుణామయుడు గౌతమబుద్ధుడు

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)

జ్ఞానం అనేది ఉందా లేదా, ఆత్మ అనేది ఉందా లేదా, ఒక సత్పదార్థం ఉందా లేదా అనేదానికి, పుస్తకాలు చదవక్కరలేదు, ఋజువులు అక్కరలేదు. గౌతమబుద్ధుడి నేత్రాలలోకి చూస్తే తెలుస్తుంది. సత్యం ఒకటి ఉందని, పరమార్థం ఒకటి ఉందని, ఆత్మతత్త్వం ఒకటి ఉందని, గౌతమబుద్ధుడి నేత్రాలు చూస్తేనే మనకి అర్థం అవుతుంది. దానికి ప్రత్యేకంగా ఋజువులు సాక్ష్యాలు ఏమీ అక్కరలేదు. అంత ప్రశాంతమైనటువంటి హృదయం కలవాడు, లోతైన హృదయం కలవాడు, సువిశాలమైన మనస్సు కలవాడు – అందుకే దశావతారాలలో బుద్ధుడిని కూడా ఒక అవతారంగా మనవాళ్ళు చేర్చుకున్నారు.

సాధారణంగా ఒక మతం స్థాపించటం సామాన్యులకి సాధ్యం కాదు. ఒక మతస్థాపకుడు ఎంతో పవిత్రుడు అయ్యి ఉండాలి. ఎంతో మేధావి అయ్యి ఉండాలి. సమాజం పట్ల, అంటే మనుషుల పట్ల, సంఘం పట్ల అపూర్వమైన, ఉదాత్తమైన లోతైన ప్రేమ ప్రవాహం ఉండాలి, అది సామాన్య మానవులకి సాధ్యం కాదు. అయినా అర్హత లేకుండా ఒక మతాన్ని స్థాపించటానికి పూనుకుంటే కాలప్రవాహంలో కొట్టుకుపోతుంది. ఏసుక్రీస్తు, గౌతమబుద్ధుడు, మహమ్మద్ వాళ్ళు మతాలు స్థాపించగలిగారు అంటే కేవలం వాళ్ళ హృదయం యొక్క లోతు, వాళ్ళ యొక్క విశాలత్వమే కారణం. సామాన్య మానవులకు సాధ్యం కాదు ఒక మతాన్ని స్థాపించటం అనేది.

సముద్రం నీరు ఎక్కడ ముట్టుకున్నా ఉప్పగా ఎలా ఉంటుందో, అలా నేను ఏది మాట్లాడినా, నా నోటితోటి ఏ మాట ఉచ్చారణ చేసినా, ఆ మాట మిమ్మల్ని మోక్షానికి తీసుకెళ్తుంది అన్నాడు బుద్ధుడు. అంటే మీ గురిని మోక్షానికి చూపిస్తుంది, మధ్యలో ఎక్కడా ఆపదు. Aim high and aim at the highest. ఈ చిల్లర గొడవల మీదకి, చిల్లర వ్యాపారాల మీదకి మీ మనస్సుని చిందించకండి. బుద్ధుడి నోటివెంట ఏ మాట వచ్చినప్పటికీ దాని గమ్యం మోక్షమే. మీ మనస్సుని మోక్షం వైపుకి తీసుకొని వెళ్ళటం కోసమే, బుద్ధుడు మాట్లాడేవాడు. సముద్రంలో నీరు ఉప్పు అంతర్భాగమై ఎలా ఉంటుందో నేను మాట్లాడే

ప్రతీ మాటలో కూడా మోక్షతత్త్వం ఉంటుంది, ఆత్మతత్త్వం ఉంటుంది. మిమ్మల్ని మోక్షానికి తీసుకుపోతుంది అన్నాడు బుద్ధుడు.

బుద్ధుడు అమృతతుల్యుడు, తన వాక్కులు కూడా అమృత వాక్కులే. అవి చిలక పలుకులు కాదు. ఒక్క మానవజాతినే కాదు, పశుపక్షులని, మొత్తం సృష్టిని అంతా కూడా అంత అద్భుతంగా ప్రేమించిన వ్యక్తి మనకి చరిత్ర పుటలలో ఎక్కడా కూడా కనిపించదు. అంత జాలి కరుణ ఉన్న హృదయం మనకి ఎక్కడా కనిపించదు. గౌతమబుద్ధుని ప్రేమఅపారం, అది మనుషులకే పరిమితం అవ్వలేదు, సృష్టిలో ప్రతి అణువుకీ, ప్రతి క్రిమికీటకానికి ఆయన ప్రేమ ప్రవహించింది. ఒక గౌతమబుద్ధుడు లోనే కాదు, కరుణ అనే గుణం ఎవరిలో అయితే ఉందో, జాలి అనే గుణం ఏ మనిషిలో అయితే ఉందో, ఆ మనిషి పిలవకుండా అన్ని సుగుణాలు కూడా వచ్చేస్తాయి. కరుణ, దయ అనే ఒక్క సుగుణం ఉంటే, మిగతా సుగుణాలు అన్నీ కూడా, మీరు పిలవకుండా అన్నీ వాటంతట అవి వచ్చి మీ హృదయంలో ప్రవేశిస్తాయి. ఈ కరుణ అనే గుణానికి అంత గొప్ప శక్తి ఉంది. మిగతా సద్గుణాలని సుగుణాలని ఆహ్వానించి తనలో ఇముడ్చుకునే శక్తి ఉంది. నిజమైన ధర్మం కరుణే. కరుణకి మించిన ధర్మం లేదు.

ఒకసారి బుద్ధుడు నిర్వాణ స్థితిని గురించి చెపుతున్నాడు. ఎదురుగా ఉన్న శ్రోత ఒకడు నిద్రపోతున్నాడు. తన అమృత సందేశాన్ని ఆపుచేసి, దృష్టిని అతని మీద సారించాడు. అప్పుడు ఒక మాట అన్నాడు బుద్ధుడు. అతిగా తినేవాడు, అతిగా నిద్రపోయే వాడు పునర్జన్మ నుండి బయట పడలేడు. అతిగా నిద్రపోయే వాడు, అతిగా భోజనం చేసేవాడు ఎంత సాధన చేసినా సరే, తిరిగి జన్మ రాకుండా చూసుకోలేడు. తప్పనిసరిగా పునర్జన్మలో పడిపోతాడు. పునర్జన్మ నుంచి విడుదల పొందలేడు. అందుచేత నువ్వు మధ్యేమార్గం అవలంబించాలి. గౌతమబుద్ధుడిది మధ్యేమార్గం. బొత్తిగా ఉపవాసాలు వద్దు, అతిగా తినవద్దు. యుక్తంగా తినండి, యుక్తంగా మాట్లాడండి, యుక్తంగా సరిపడి నిద్రపోండి. తీగని బాగా లాగినా తెగిపోతుంది, వదులుగా ఉంటే పాట పలకదు. మీ మనస్సు అనే తీగని సమానంగా ఉంచుకోండి. అతి ఏ విషయంలోనూ పనికిరాదు. అందుచేత, నా బోధ విన్నా, నువ్వు ఏ ఉపనిషత్తులు చదువుకున్నా, ఏ సనాతన ధర్మాన్ని నువ్వు

అనుసరిస్తున్నప్పటికీ , అతిగా మాట్లాడేవాడికి, అతిగా నిద్రపోయే వాడికి, అతిగా భోజనం చేసేవాడికి పునర్జన్మ నుంచి బయట పడలేడు అన్నాడు బుద్ధుడు. అప్పుడు వాడు, తథాగతా, మహానుభావా, నాకు నిద్ర అనేది చాలా ఇష్టం, భోజనం అనేది నాకు చాలా ఇష్టం. నాకు భోజనం చేయటం, నిద్రపోవటం, ఇదే నాకు జీవితంలో చాలా ప్రియాతిప్రియం. జాగ్రత్తగా తినమని మీరు ముందు చెప్పే మాటలు కూడా విన్నాను. కాని నాకు అతిగా తినటం అనేది ఒక వాసన. అతిగా తినటం విడిచిపెట్టలేను ఆచార్యా, అన్నాడు.

ఈ సంఘటన చెప్పటం కోసం మీకు చెప్పటం లేదు. అప్పుడు గౌతమబుద్ధుడు ఒకమాట అన్నాడు. నీకు ఒక మంత్రం చెపుతాను. ఆ మంత్రాన్ని నువ్వు జపించుకొంటూ ఉండు. బుద్ధుడు ఎంత కరుణామయుడో చూడండి. ఎవడో వాడు అతిగా భోజనం చేస్తే మనకి ఏమిటి అనుకోలేదు. అతనిని కూడా ఉద్ధరించాలని. అతనిని కూడా మనతో పాటు తీసుకుపోవాలని. నీకొక మంత్రం చెపుతాను. ఆ మంత్రాన్ని నువ్వు ఉచ్చారణ చేయగా చేయగా, నీకు అతినిద్ర అతిభోజనం తగ్గుతుంది. సమాన స్థాయిలోకి వస్తావు. సమస్థితి లోకి వస్తావు అన్నాడు. వాడు ఎంత సోమరితనానికి అలవాటు పడిపోయాడంటే జీవితంలో, ఆచార్యా, నాకు అతి తిండి ఎలా అలవాటు ఉందో అతి నిద్ర ఎలా అలవాటు ఉందో, జ్ఞాపక శక్తి కూడా నాకు లేదు అన్నాడు. ఎంత కరుణామయుడో బుద్ధుడు చూడండి, అప్పుడు కూడా అతనిని విడిచిపెట్టలేదు. మనము చూసి అసహ్యించుకోవచ్చు, అతనిని చూసి ఏవగించుకోవచ్చు, అతను మొద్దబ్బాయి అని వదిలివేయవచ్చు. కాని బుద్ధుడి యొక్క కరుణ అక్కడ కూడా ఆగలేదు. వీడు, నాకు అతి నిద్ర అన్నాడు, అతి భోజనం అన్నాడు, మీరు చెప్పే మంత్రాన్ని కూడా అనుకోలేను అన్నాడు, నాకు మరుపు ఎక్కువ అన్నాడు. అప్పుడు కూడా బుద్ధుడు అతనిని వెంటాడుతున్నాడు, విడిచిపెట్టలేదు. మీ ఇంట్లో వాళ్ళు ఎవరైనా ఇక్కడికి వచ్చారా అని అడిగాడు బుద్ధుడు. మా ఇంట్లో వాళ్ళు వచ్చారు అని చెప్పాడు. వాళ్లకి ఈ మంత్రం చెపుతాను, వాళ్ళు నీ చెవిలో ఊదుతూ ఉంటారు అస్తమానూ అన్నాడు. అది బుద్ధుని యొక్క దయ. బుద్ధుని యొక్క కరుణ అది. అయితే ఒక జ్ఞానిలో నుంచి మట్టుకే, విశాలమైన హృదయం, లోతైన హృదయం ఉన్న మనిషి లోనుంచే ఈ కరుణ వచ్చి మానవజాతిని తడుపుతుంది కాని సామాన్య మానవుడు ఇటువంటి కరుణని చూపించలేడు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 5 మే 1996, ఈడూరు

ప్రియమైన  ఆత్మబంధువుల్లారా!

భగవంతుడు ఏమని చెబుతున్నాడు అంటే మంచి ఆలోచించు, మంచి మాట్లాడు, మంచి చెయ్యి అన్నాడు.  నోటితో మాట్లాడితే మంచి మాట మాట్లాడు, చేతి తోటి చేస్తే మంచి పని చెయ్యి, కళ్లతోటి చూస్తే మంచి చూడు.  మీకు అర్థం అవుతోందా?  మంచి విషయమే ఆలోచించు.  ఇలా జీవించటం వలన నీ మనసు పవిత్రం అవుతుంది, నీ మనసు సూక్ష్మం అవుతుంది.  నువ్వు చెడు చేస్తూ ఉంటే నీ బుద్ధి స్థూలబుద్ధి అయిపోతుంది. నువ్వు మంచి చేస్తుంటే నీకు సూక్ష్మబుద్ధి కలుగుతుంది.  నువ్వు హృదయంలో పవిత్రుడవు అవుతావు.  కొంతమంది ఒకటి చెబితే ఇంకొకటి అర్థం చేసుకుంటారు, వాళ్ళని మాలోకం జనం అంటారు.  ఈ మాలోకం జనాన్ని ఎవడూ రక్షించలేడు.  మనం ఏదో ఒక మంచి విషయం చెబుతుంటే దానికి పెడార్థాలు తీసి, ఇంకొక రకంగా అర్థం చేసుకుంటే ఎలాగ? ఎవరు బాగుపడతారు అంటే ఇప్పుడు గురువు నీకు చెబుతున్నాడు, ఆ గురువు చెప్పే దానిని ప్రోపర్‌గా అర్థం చేసుకోవాలి, దానికి పెడార్థాలు తియ్యకూడదు.  ఆచార్యస్వాములవారు చెప్పేది right speech, Right action, right understanding.  అంటే భగవంతుడు ఒక మాట చెబితే ఆ మాటను ప్రోపర్‌గా, ఎలా అర్థం చేసుకోవాలో అలా అర్థం చేసుకోవాలి కానీ పెడార్థాలు తియ్యకూడదు, పెడార్థాలు తీస్తే నువ్వు పాడయిపోతావు.  నీకు పుణ్యబలం లేకపోతే ఆ శబ్దం కూడా తన స్వరూపాన్ని నీకు ఇవ్వదు.  ఎప్పుడైనా భగవద్గీత చదివినప్పుడు ఎలా అర్థం చేసుకోవాలో అలా అర్థం చేసుకోవాలి కానీ అటు ఇటు దానిని లాగకూడదు. భగవంతుడు ఒక మాట చెప్పినప్పుడు, భగవంతుడి హృదయంలో ఏ అర్థం అయితే ఉందో దానిని గ్రహించగలగాలి.  నీకు right understanding అవసరం.  నీకు పుణ్యబలం లేకపోతే right understanding రాదు.  Right action ఒక్కటే సరిపోదు, right speech ఒక్కటే సరిపోదు, right understanding కూడా అవసరం, right path కూడా అవసరం.  మీ మెదడుని మీరు జాగ్రత్తగా ఉపయోగించుకుని శబ్దాన్ని బాగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యండి. ఒకవేళ భగవంతుడు చెప్పిన మాట మీకు అర్థం కాకపోతే మీకు పుణ్యబలం లేదు అని

అర్థం అంటున్నారు ఆచార్యస్వాములవారు. ఒక విషయాన్ని ఉన్నది ఉన్నట్టుగా నువ్వు అర్థం చేసుకోవాలి. అర్థమయ్యిపోయింది కాబట్టి అనుభవంలోకి వచ్చేస్తుంది అనుకోకు, నీకు అర్థమైన విషయం అనుభవంలోకి రావడానికి కొంత టైము పడుతుంది. అక్కడ గురువు అనుగ్రహం అవసరం, ఈశ్వరానుగ్రహం అవసరం. ఒకవేళ నీకు తెలివితేటలు ఉండి చక్కగా అర్థం చేసుకున్నప్పటికీ, నీకు గురువు అనుగ్రహం లేకపోతే నువ్వు అర్థం చేసుకున్న విషయం నీకు అనుభవంలోకి రాదు. నీకు ఉన్న వివేకం వల్ల, పవిత్రత వల్ల, నీ లోపల ఉన్న వస్తువు నీకు తెలుస్తుంది కానీ బాహ్యంగా ఏదో చేయటం వల్ల తెలియబడదు. స్పష్టంగా ఎంతో క్లారిటీ తోటి చెబుతున్నారు ఆచార్యస్వాములవారు. మన మీద ఉండే ప్రేమ కొలది, మన మీద ఉండే ఆప్యాయత కొలది చెబుతున్న మాటలు అవి. నువ్వు బాహ్యంగా అక్కడ గోడ కట్టించాను, ఇక్కడ నుయ్యి తవ్వించాను అంటే చేస్తే చెయ్యి, నేను వద్దు అనడం లేదు, దానివల్ల నీకు పుణ్యం వస్తుంది, అనుభవిస్తే పోతుంది. లోపల నీకు అసలు correct understanding ఉండాలి. Discrimination ఉండాలి. లోపల పవిత్రత ఉండాలి, నీకు యోగ్యత ఉండాలి, దానివల్ల నీకు వస్తువు తెలియబడుతుంది కానీ అక్కడ ఏదో చేశాను, ఇక్కడ ఏదో చేశాను, ఆ పనుల వల్ల నీకు తెలియబడదు అంటున్నారు ఆచార్యస్వాములవారు.

మనం ఇప్పుడు భీమవరం వెళుతూ ఉంటే, జిన్నూరుకి మనం దూరం అవుతాం. అలాగే సత్యాన్ని ఉన్నది ఉన్నట్టు అర్థం చేసుకుంటూ ఉంటే అసత్యం నుండి బయట పడాలి అని నువ్వు అనుకోవక్కర్లేదు, దానంతట అదే అసత్యం దూరం అయిపోతుంది. Lightnessకి దగ్గరయ్యేకొలది darknessకి దూరం అవుతావు. realityకి దగ్గర అయ్యేకొలది unrealityకి దూరం అవుతావు. అంటే reject the unreality, take the reality. సత్యాన్ని గ్రహించు, అసత్యాన్ని విసర్జించు. నువ్వు సత్యాన్ని గ్రహిస్తుంటే అసత్యానికి నువ్వు సాధారణంగానే దూరం అవుతావు. నువ్వు సత్యానికి దగ్గర అయితే దానికి సంబంధించిన రుచి నీకు తెలుస్తుంది, దానిని పొందాలి అనే కాంక్ష కూడా రెట్టింపు బలం తోటి నీలో తిరుగుతూ ఉంటుంది. బాహ్యంగా ఏదో ఒక పని చెయ్యడం వలన నాకు మోక్షం వచ్చేస్తుంది అనే భ్రాంతిలో మటుకు పడకు. చేస్తే చెయ్యి, మంచి పనులు చెయ్యవద్దు అనడం లేదు, మంచి

పనులు చేస్తే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, మనస్సులో పవిత్రత వస్తుంది, నేను కాదు అనడం లేదు. అంతమాత్రం చేత మోక్షం వచ్చేస్తుంది అనే భ్రాంతిలో, భ్రమలో పడకు నువ్వు. జాగ్రత్తగా ఉండు, అజాగ్రత్త పనికిరాదు.

ఎవరైనా గురువులు చెప్పినప్పుడు, పెద్దలు చెప్పినప్పుడు నీ తలకాయ అక్కడ ఉంచి శ్రద్ధగా విను అని ఆచార్యస్వాములవారు చెబుతున్నారు. గురువు ఏ విషయం అయితే చెబుతున్నాడో ఆ చెప్పిన విషయాన్ని నీ బుద్ధి తోటి పట్టుకోవాలి, ఇంటికి వెళ్ళిపోయిన తరువాత ఆ మాటని నువ్వు ధ్యానం చెయ్యాలి. గురువు చెప్పిన మాటని శ్రద్ధగా శ్రవణం చెయ్యాలి, దానిని ప్రోపర్‌గా అర్థం చేసుకోవాలి. మీకు ఇష్టమైన దేవుడిని, రాముడిని, కృష్ణుడిని, ఇతర దేవుళ్ళని ఏవిధంగా అయితే పూజిస్తున్నారో, ధ్యానం చేస్తున్నారో, అలాగే గురువు దగ్గర ఏ మాట అయితే విన్నావో, ఆ మాటని కరెక్ట్‌గా ఉన్నది ఉన్నట్టుగా నువ్వు అర్థం చేసుకుని, ఇంటికి వెళ్లి దాని తాలుకు అర్థాన్ని ధ్యానం చెయ్యి. ఇవాళ ఈ మాట విన్నాను, ఈ మాటలో అర్థం ఏమిటి? ఈ మాట ఎంతవరకు నాకు ఉపయోగపడుతుంది అని ఆ మాట తాలూకు అర్థాన్ని ధ్యానం చెయ్యాలి. అప్పుడు నీ వివేకం పెరుగుతుంది, లోపల ఎదుగుతావు.

ఆచార్యస్వాములవారు చెప్పేది ఏమిటి అంటే మనిషికి తెలివితేటలు అవసరమే, తెలివితేటలు విడిచిపెట్టమని చెప్పడం లేదు, నీ తెలివితేటల వల్లే మోక్షం వచ్చేయదు. ఆ తెలివితేటలు ఎంతవరకు ఉపయోగపడతాయో అంతవరకు జాగ్రత్తగా ఉపయోగించుకో, ఆ తెలివితేటలు నువ్వు సద్వినియోగం చేసుకో, దుర్వినియోగం చెయ్యకు. సబ్జెక్టు ప్రోపర్‌గా నువ్వు అర్థం చేసుకోకుండా బయటఉన్న గాలి లోపలకి లాగేశాను, లోపలఉన్న గాలి బయటకి వదిలేశాను అంటే నీ physical exercise వల్ల దేవుడు నీకు తెలియబడదు అంటున్నారు. అంటే నువ్వు ప్రాణాయామం చేసుకుంటే చేసుకో, ఆరోగ్యం బాగుపడుతుంది, నీ మనసు చల్లబడుతుంది. నీ మనస్సుకి ఏకాగ్రత రావచ్చు. అంతమాత్రం చేత నీకు మోక్షం వచ్చేస్తుంది, నువ్వు దైవ సాక్షాత్కారం పొందుదాం అని మటుకు అనుకోకు. గాలి పీల్చేయడం, గాలి విడిచిపెట్టేయడం వలన మటుకు నీకు మోక్షం వచ్చేస్తుంది అని అనుకోవద్దు. మీరు ఎవరైనా ఆసనాలు వేస్తున్నారు అనుకోండి, ఆసనాల యొక్క ప్రయోజనం ఏమిటి? శారీరక

ఆరోగ్యం బాగుపడుతుంది. మీకు ఆరోగ్యం వస్తే రావచ్చు, అంతేకానీ ఆసనాలు వేశాను నాకు మోక్షం వచ్చేస్తుంది అని కనిపెట్టుకుని ఉండకు వెర్రివాడా అంటున్నారు. ఆసనాలు వేస్తే వేసుకోండి, మీకు ఆరోగ్యం వస్తుంది. ఈ ముక్కు మూసుకోవడం కూడా నేర్చుకోండి, మనసు కూడా చల్లబడితే చల్లబడుతుంది. ఈ పనుల వల్లే మీకు మోక్షం వస్తుంది అని ఎదురు చూడకండి రాదు రాదు అంటున్నారు ఆచార్యస్వాములవారు.

ఎవడైతే సాధన చేస్తున్నాడో, వాడి యొక్క సక్సెస్ దేని మీద ఆధారపడి ఉంది అంటే ముక్కు మూసుకోవడం మీద, రామేశ్వరం వెళ్ళడం, కాశీ వెళ్ళడం మీద ఆధారపడి లేదు. వాడికున్న అర్హత మీద, వాడికున్న గుణ సంపద మీద, వాడికున్న యోగ్యత మీద మోక్షం వస్తుందా లేదా అని ఆధారపడి ఉంటుంది కానీ నేను అత్తిలి వెళ్లాను, కాశీ వెళ్లి వచ్చాను, రామేశ్వరం వెళ్లి వచ్చాను అంటే డబ్బు ఉంటే అందరి దగ్గరకి వెళ్లి వచ్చేయవచ్చు, ఆధ్యాత్మికంగా నువ్వు పొందే స్థితి దాని మీద ఆధారపడి ఉండదు. నిన్న భీమవరంలో యోగా క్లాసు పెట్టారు, అక్కడ ముక్కు మూసుకోమంటే మూసుకుని వచ్చాను, లేకపోతే రాజమండ్రిలో ఆసనాలు నేర్పుతున్నారు అక్కడకి వెళ్లి ఆసనాలు నేర్చుకుని వచ్చాను అంటే వాటి వలన వచ్చే ప్రయోజనం వస్తుంది అంతేకానీ దేవుడు వీటి వల్ల మోసపోడు. ఎవరికి మోక్షం రివీల్ అవుతుంది అంటే, వాడికున్న యోగ్యత, వాడికున్న అర్హతలు, వాడికున్న గుడ్ qualities, వాడికున్న దైవీసంపద దానిని బట్టి వాడికి మోక్షం వస్తుందా, రాదా అని ఆధారపడి ఉంటుంది కానీ నేను కూర్చున్నాను, నుంచున్నాను, గాలి బిగపెడుతున్నాను అంటే వీటివల్ల దేవుడు మోసపోడు అంటున్నారు. చెప్పవలసిన విషయం నువ్వు చెప్పు, చెప్పకూడని విషయం చెప్పకు, చెప్పకూడని విషయం చెప్పడం ఎంత పొరపాటో చెప్పవలసిన విషయం విడిచిపెట్టడం కూడా అంతే పొరపాటు అంటున్నారు.

ఎప్పుడు పూజ చేసుకోవాలి, ఎప్పుడు ధ్యానం చేసుకోవాలి, ఎప్పుడు శ్రవణం



**కోరిక వలన, కోపం వలన, భయం వలన మనకు దుఃఖం వస్తోంది. భయానికి కారణం ద్వైతం. మనం అద్వైతానుభవం పొందేవరకు భయం విడిచిపెట్టదు.**

చెయ్యాలి అని నీ పద్ధతిలో నువ్వు చేసుకుని, నీ కాలాన్ని అనుసరించి, నీ ఆరోగ్యాన్ని అనుసరించి నీ తిప్పలు ఏవో నువ్వు పడు. మీకు అర్థం అవుతోందా? ఇవన్నీ కూడా బ్రహ్మానుభవం కలగడానికి సహకారం చేయవచ్చు కానీ వీటివల్లే బ్రహ్మానుభవం కలుగదు. నా కళ్లజోడు తేలేదు అని నేను అనుకుంటున్నాను, రామచంద్రరాజు గారు కూడా ఇక్కడ లేదనే చెప్పారు కానీ కళ్లజోడు ఇక్కడే ఉంది. అదేవిధంగా హృదయంలో ఉన్నటువంటి సద్వస్తువు మనకి తెలిసున్నా అక్కడే ఉంది, తెలియకపోయినా అక్కడే ఉంది, ఒకవేళ మనకి తెలియక లేదు లేదు అనుకున్నా ఉన్నది లేకుండా పోదు.

ఇప్పుడు మీరు శ్రవణం చేస్తున్నారు, అంతమాత్రం చేతే మీకు మోక్షం వచ్చేయదు. మోక్షాన్ని పొందడానికి శ్రవణం కూడా సహకారం చేస్తుంది. ఎవరైతే మాకు మోక్షానుభవం కావాలి అని కోరుకుంటున్నారో, ఎవరైతే ఆ పరమశాంతిని పొందాలని అనుకుంటున్నారో ముందు discrimination నేర్చుకోండి, వివేకాన్ని ప్రాక్టీస్ చెయ్యండి అంటున్నారు. Discrimination అంటే ఏది నిజం? ఏది నిజం కాదు? ఏది సత్యం? ఏది సత్యం కాదు? ఏది శాశ్వతం? ఏది శాశ్వతం కాదు? ఈ విడదీసుకునే బుద్ధిని ప్రాక్టీస్ చెయ్యి అంటున్నారు ఆచార్యస్వాములవారు. అంటే discrimination విడిచిపెట్టకు. నీకు understanding ఉండాలి. అంటే ఏది మనం విడిచిపెట్టాలి? ఏది మనం స్వీకరించాలి? ఎవరితోటి స్నేహం చెయ్యాలి? ఎవరితోటి చెయ్యకూడదు? ఎవరికి సమీపంలో ఉండాలి? ఎవరికి దూరంగా ఉండాలి? అనేది ముందు నీకు తెలియాలి. మీకు అర్థం అవుతోందా? మనం గ్రహించవలసినది ఏమిటి? విసర్జించవలసినది ఏమిటి? బాహ్యంగా ఎవరితోటి సహవాసం చెయ్యాలి? ఎవరి తోటి చెయ్యకూడదు అన్న విషయమే నీకు తెలియనప్పుడు లోపల ఉన్న సద్వస్తువు ఇంక నీకు ఎలా తెలుస్తుంది అంటున్నారు ఆచార్యస్వాములవారు. అసలు నీ దేహమే నిన్ను నాశనం చేస్తోంది అన్న సంగతి నీకు ఎంతో కొంత వివేకం లేకపోతే తెలియదు అంటున్నారు. అంటే వివేకాన్ని ప్రాక్టీస్ చెయ్యి.

గౌతమబుద్ధుడు ఏమని చెప్పాడు అంటే, మనకి ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా, ఏదైతే మనం కాదో ఈనాటికి అయినా, ముందు నాటికి అయినా అందులోంచి విడిపోవడం తప్పదు అన్నారు. ఏదైతే మనం కాదో దానిలోంచి మనం విడిపోవడం తప్పదు. దేహం

నువ్వు కాదు కాబట్టి ఏదో ఒక రోజున దాంట్లోంచి విడిపోతావు. మిమ్మల్ని ఎవరైనా పొగిడారు అనుకోండి ఆ పొగడ్తలు కూడా మీరు తీసుకోవద్దు, విమర్శలు కూడా మీరు తీసుకోవద్దు. ఎందుచేత అంటే మీ మీద అసూయ వల్ల కూడా చాలామంది విమర్శలు చేయవచ్చు, అది కూడా తీసుకోవద్దు. సూక్ష్మబుద్ధిని ఉపయోగించి నీకు అక్కర్లేని గొడవలు అన్నింటిని గెంటేసి discrimination ప్రాక్టీస్ చేసి సత్యాన్ని స్వీకరించి అసత్యాన్ని reject చెయ్యమంటున్నారు ఆచార్యస్వాములవారు.

నీకు ఏ వస్తువు అయితే కావాలో ఆ వస్తువు గురించి కొంతవరకైనా తెలిసినవాడిని ఆశ్రయించు. ఆచార్యస్వాములవారు చెప్పేది ఏమిటంటే సోడా కొట్టులోకి వెళ్ళి సోడాలు అడగాలి కానీ సోడా కొట్టులో కూర్చుని ఇడ్లీలు, కాఫీలు తెమ్మని అడగకూడదు. మీకు అర్థం అవుతోందా? అదేవిధంగా ఏ వస్తువుని అయితే పొందుదాం అని నువ్వు అనుకుంటున్నావో, ఆ వస్తువు గురించి ఎవరైతే చెబుతున్నారో వాళ్ళ దగ్గరకి వెళ్ళి, వాళ్ళని ఆశ్రయించి, ప్రశ్నించి తెలుసుకో, వారిని పరీక్షించడానికి అడగకు, నువ్వు తెలుసుకోవడానికి అడుగు అంటున్నారు ఆచార్యస్వాములవారు, ముందు ఏమి కావాలో నిర్ణయించుకో. నీకు బ్రహ్మానుభవం కావాలి అంటే, మోక్షస్థితి కావాలి అంటే, ఆ మోక్షానుభవం ఎంతో కొంత ఉన్నవాళ్ళ దగ్గరకి వెళ్ళి ఆశ్రయించి, అడిగి తెలుసుకో. ఆచార్యస్వాములవారు ఏమంటున్నారు అంటే సబ్జెక్టు తెలిసి ఉన్నవాడి దగ్గరకే వెళ్ళండి, సబ్జెక్టు అవసరమే ఆ సబ్జెక్టు ఒక్కటే తెలిసి ఉంటే చాలదు వాడికి, ఆ సబ్జెక్టు తెలిసున్నవాడికి కురచ ఆలోచన ఉండవచ్చు, అటువంటి వాడి దగ్గరకు వెళితే సరిపోదు. ఆ సబ్జెక్టు తెలిసున్నవాడు ఎటువంటి వాడు అయి ఉండాలి అంటే, సముద్రం ఎంత విశాలంగా ఉంటుందో, అంత విశాలం అయినటువంటి ప్రేమ, అంత విశాలం అయినటువంటి కరుణ ఉన్న గురువుని మటుకే ఆశ్రయించు. సబ్జెక్టు తెలిసుంటే సరిపోదు ఆ సబ్జెక్టు ఇతరులకి చెప్పి వాళ్ళని ఉద్ధరించాలనే కాంక్ష ఉన్న గురువుని ఆశ్రయించాలి. సముద్రంలో నీరు తరుగుతుందా? తరగదు. అటువంటి తరుగు లేని Compassion కూడా ఉండాలి. ఎదుటివాళ్లకి చెప్పి ఉద్ధరించాలి అనే కాంక్ష కూడా అక్కడ ఉండాలి. అటువంటి గురువుని మాత్రమే మీరు ఆశ్రయించాలి అంటున్నారు.

మీరు బ్రహ్మం గురించి శ్రవణం చెయ్యండి. బ్రహ్మం గురించి శ్రవణం చెయ్యకుండా

బ్రహ్మం గురించి మననం చెయ్యలేరు. అందుచేత మీరు ఏమి చెయ్యాలి అంటే శ్రవణం చెయ్యాలి, శ్రవణం చెయ్యకుండా మననం చెయ్యలేరు. ఏది మీరు మననం చేశారో అదే మీకు అనుభవంలోకి వస్తుంది. మీరు మొద్దుఅబ్బాయిలుగా ఉండకండి, వివేకవంతులుగా ఉండండి, కాంతివంతులుగా ఉండండి, శాంతివంతులుగా ఉండండి, తెలివిగా ఉండండి. గురువు చెప్పేటప్పుడు ఆ నోటి వెంట మాట కిందకి జారేటప్పటికీ అది భూమి మీద పడకుండా గబుక్కున పట్టుకొని మీ బుర్రలో పెట్టేసుకోండి. ఆ మాట యొక్క అర్థమేమిటో, ఆ మాట యొక్క విలువ ఏమిటో మీరు గ్రహించండి. అవగాహన చేసుకునే శక్తిని పెంచుకోండి, అవగాహన కూడా యోగం తోటి సమానం.

కొంతమందికి మాటిమాటికి సందేహాలు వస్తాయి, కొంతమందికి కూర్చుంటే అనుమానం, నుంచుంటే అనుమానం, మాట్లాడితే అనుమానం, భగవంతుడు గీతలో ఈ అధ్యాయంలో ఇలా ఎందుకు చెప్పాడు, ఆ అధ్యాయంలో అలా ఎందుకు చెప్పాడు అని అనుమానాలు వస్తూ ఉంటాయి. సబ్జెక్టుని ప్రోపర్‌గా అర్థం చేసుకుంటే అనుమానాలు అన్నీ కూడా కాలిపోయి బూడిద అయిపోతాయి. సబ్జెక్టు ఎంత తక్కువ అర్థం అయితే డౌట్స్ అన్ని ఎక్కువ ఉంటాయి. బాగా అర్థం చేసుకుంటే డౌట్స్ కూడా తగ్గిపోతాయి. నీకు వచ్చే అనుమానాలు అన్నీ కూడా తగ్గాలి అంటే, అందరి దగ్గరకి తిరగక్కరలేదు మీరు సబ్జెక్టు బాగా అర్థం చేసుకుంటే మీకున్న సందేహాలు వాటంతట అవే తగ్గిపోతాయి. అవగాహనశక్తి తక్కువ ఉంటే అనుమానాలు పెరుగుతాయి, అవగాహనశక్తి కనుక ఎక్కువ ఉంటే సందేహాలు అన్నీ కూడా కరిగిపోతాయి. అంతేకాదు మీ reasoning faculty కూడా పెరుగుతుంది. ఎవరు ఏ ఉద్దేశ్యం తోటి మాట్లాడుతున్నారు? ఈ మాట్లాడడం వలన వాళ్లకి ఏమైనా స్వార్థం ఉందా? స్వార్థం లేకుండా మాట్లాడుతున్నారా? మనల్ని ప్రేమించి మాట్లాడుతున్నారా? అవసరం కోసం మాట్లాడుతున్నారా అని గ్రహించే శక్తి పెరుగుతుంది.

లౌకిక విషయం అయినా సరే, అలౌకికమైన విషయం అయినా సరే, మాట్లాడుతున్నప్పుడు ఏ ఉద్దేశ్యం తోటి మాట్లాడుతున్నారో నువ్వు పట్టుకో, నీ intelligence కనుక ప్రోపర్‌గా ఉంటే, నీకు Discrimination కనుక ఉంటే, బ్రహ్మానుభవం వస్తుందో, రాదో తరువాత విషయం, ముందు దానికి ఫిట్ అవుతావు. నువ్వు చదవవలసిన చదువు చదివితే

ఉద్యోగం రావచ్చు, రాకపోవచ్చు, చదవవలసిన చదువు చదవకపోతే అసలు నువ్వు అప్లికేషను పెట్టడానికే పనికిరావు. అది ఇక్కడ ఆచార్యస్వాములవారు చెప్పేది. నీకు అవగాహన శక్తి సరిగా ఉంటే ఆ discrimination కనుక ఉంటే ముందు నువ్వు ఫిట్ అవుతావు. తరువాత మోక్షం వస్తుందో, రాదో ఈశ్వరఅనుగ్రహం మీద ఆధారపడి ఉంటుంది.

నీకు తెలివితేటలు ఉండవచ్చు, మాములుగా మాట గ్రహించే శక్తి ఉండవచ్చు, కానీ భోగకాంక్ష ఉంది అనుకోండి, లోకంలో అన్నీ మనమే భోగించాలి అనే భోగకాంక్ష ఉంది అనుకో, నీకు తెలివితేటలు ఉన్నప్పటికీ, నీ తెలివితేటలు బట్టి నీకు మోక్షం ఇవ్వరు. ఆ భోగకాంక్ష ఉన్నప్పుడు నిన్ను తీసుకెళ్ళి ఒక పక్కన పెడతారు. అంటే కర్మచక్రంలో పెడతారు కానీ భగవంతుడు తన హృదయాన్ని నీకు ఇవ్వడు అంటున్నారు. భోగవాసన ఒక్కటి ఉంటే చాలు పునర్జన్మ రావడానికి. అంటే పునర్జన్మ హేతువులు ఏ ఒక్కటి ఉన్నప్పటికీ నువ్వు క్వాలిఫై అవ్వవు. అంటే నీకు బుద్ధిసూక్ష్మత ఉండాలి, ఏ వాసన కూడా నిన్ను బయటకి ఆకర్షించకూడదు, ఏ భోగప్రవృత్తి నీలో ఉండకూడదు, భోగప్రవృత్తి ఉంటే మనసుని బాహ్యానికి లాగేస్తుంది. అంటే నీకు బుద్ధిసూక్ష్మత ఉండాలి, బుద్ధిసూక్ష్మతతో పాటు బుద్ధిలో భోగప్రవృత్తి ఉండకూడదు. అట్టి అర్హత ఉంటేనే బ్రహ్మానుభవం పొందడానికి నువ్వు ఫిట్ అవుతావు.

మన మనస్సు అనేక కారణాల వల్ల ప్రపంచంలోకి వెళ్ళవచ్చు, నాకు ఒక కారణం ఉండవచ్చు, మీకు ఒక కారణం ఉండవచ్చు, అంటే భోగప్రవృత్తి ఏ రూపంలో ఉన్నప్పటికీ దానిని ఎలిమినేట్ చెయ్యవలసిందే. మీకు ఏరకమైన భోగకాంక్ష ఉన్నప్పటికీ నువ్వు బ్రహ్మానుభవం పొందడానికి అర్హుడవు కాదు. మనస్సులో చాపల్యం, ఇంద్రియాలలో చాపల్యం ఎక్కువ ఉన్నవాళ్ళు ఈ ఆధ్యాత్మిక అనుభవం పొందటం కోసం వాళ్ళు ఫిట్ కారు. ఒకొక్కసారి మనకి మోక్షం పొందుదాం, ఆచార్యస్వాములవారు బాగానే చెబుతున్నారు మిగతావి అన్నీ అశాశ్వతమే, మోక్షం పొందుదాం అనే కాంక్ష ఒకోసారి నిజంగానే వస్తుంది, అది ఎంతసేపు ఉంటుంది? ఐదు నిమిషాలో, పది నిమిషాలో ఉంటుంది. అది అయిపోయాక మళ్ళీ మన కోరికల కోసమే దేవుడిని ప్రార్థిస్తూ ఉంటాం. ఆచార్యస్వాములవారు చెప్పేది ఏమిటి అంటే మీరు పూజగదిలో ఉన్నా, వంటగదిలో ఉన్నా, ఆఫీసులో ఉన్నా, లేకపోతే రోడ్డుమీద ఉన్నా,

మీ ఇంటికాడ లౌకికమైన పని చేస్తున్నా, అలౌకికమైన పని చేస్తున్నప్పటికీ, మీ యొక్క ధ్యేయం మోక్షకాంక్ష ఒక్కటే ఉండాలి. మోక్షమే పొందాలి అనేటటువంటి కాంక్ష ఎలా ఉండాలి అంటే, పొట్టి పొట్టిగా ఉండకూడదు, ఎంతకాలం అయితే మీ ముక్కులో గాలి తిరుగుతూ ఉంటుందో అంతకాలం కూడా ఆ కాంక్ష ఆరిపోకుండా ఉండాలి. ఇప్పుడు మనం మోక్షం కోరుకుంటాం, మళ్ళీ రేపు మనకి ఏవో కోరికలు ఉంటాయి కదా, ఆ కోరికలు fulfill అయితే చాలు, దేవుడు మనకి ఆ కోరిక నెరవేర్చితే చాలు అనిపిస్తుంది. అప్పుడు మోక్షాన్ని మనం వదిలేస్తున్నాం. అదికాదు ఇక్కడ నిరంతరం అదే కాంక్ష కలిగి ఉండాలి.

భౌతికమైన కోరికలు నీకు నెరవేరితే నెరవేరతాయి అది ముఖ్యం కాదు, మీ కాంక్ష మటుకు మోక్షం మీద ఉండాలి. మోక్షకాంక్ష ఆరిపోకుండా మటుకు మీరు చూసుకోవాలి. ఇప్పుడు తాత్కాలికంగా అందరికి మోక్షం పొందాలి అనే కోరిక వస్తుంది కాని ఆ కోరిక మీకు permanentగా ఉండాలి. ఒకరోజు వచ్చి మరొక రోజు పోయేలా ఉండకూడదు, అప్పుడు మోక్షం మీకు రివీల్ అవుతుంది. అంటే ఏదైతే మీరు స్మరిస్తున్నారో అదే పొందుతారు. మోక్షం పట్ల మీకు ఆకాంక్ష ఉంటే అది మీకు ఎరుక పడుతుంది. ఈ సందర్భంలో ఇంకొక మాట నేను చెబుతున్నాను మహర్షులు, యోగులు, పూర్వం ఉపనిషత్తులు చెప్పినటువంటి ఋషులు కొన్ని qualifications చెప్పారు ఈ మోక్షం పొందడం కోసం. అందులో మెయిన్ ఏమిటి అంటే devotion to reality. నీ హృదయంలో ఉన్న నిజం పట్ల నీకు devotion ఉండాలి. నీ హృదయంలో చావు లేని వస్తువు ఒకటి ఉంది, నీ హృదయంలో ఒక నిజం ఉంది, ఆ నిజం అన్నిటికీ అతీతమైనది. ఆ నిజం పట్ల నీకు devotion ఉండాలి. నీ హృదయంలో ఉన్న భగవంతుడిని, నీ హృదయంలో ఉన్న చైతన్యాన్ని, ఎరుక పరచుకోవాలి అనేటటువంటి ఆ తృష్ణ, Devotion to reality ముఖ్యం. మీకు రాముడి మీద భక్తి ఎలా ఉందో, కృష్ణుడి మీద భక్తి ఎలా ఉందో, శివుడి మీద భక్తి ఎలా ఉందో, ఏసుక్రీస్తు మీద భక్తి ఎలా ఉందో, మహమ్మద్ మీద భక్తి ఎలా ఉందో, దేవతాపురుషుల మీద భక్తి ఎలా ఉందో, అలా మీ హృదయంలోని నిజం మీద కూడా మీకు devotion ఉండాలి. దానిని తెలుసుకోవాలి అనే కాంక్ష మీ హృదయాంతరాళాల్లోంచి రావాలి. నీ శరీరం మీద నీకు మోహం ఎలా

ఉందో, నీ శరీరం మీద నీకు ప్రీతి ఎలా ఉందో అలా నీ హృదయంలో ఉన్న నిజం మీద, నీ హృదయంలో ఉన్న దేవుడి మీద నీకు ప్రీతి ఉండాలి. అప్పుడు immortal state నువ్వు అందుకుంటావు, అంటే చావులేని స్థితికి నువ్వు వెళ్ళిపోతావు.

హృదయంలో ఒక నిజం ఉంది, దానికి చావు లేదు. It is eternal in nature, it is purity in nature, it is immortal in nature, it is true in nature, it is happiness in nature. నిజం నీ హృదయంలో ఉంది, దానిపట్ల నువ్వు devotion కలిగి ఉండు. దానిపట్ల నువ్వు భక్తి కలిగి ఉంటే అది నీకు ఎరుక పడుతుంది, అది నీకు తెలియబడుతుంది. నువ్వు వెతికే వస్తువు, నువ్వు అన్వేషించే వస్తువు, చావులేని వస్తువు, నిరంతరం ఉండే వస్తువు, పుట్టుకలేని వస్తువు అది నీ హృదయంలోనే ఉంది, దానిపట్ల నువ్వు devotion కలిగి ఉంటే అది నీకు తానుగా తెలియబడుతుంది. ఇక్కడ ఆచార్యస్వాములవారు అనేది ఏమిటంటే నీ శరణాగతి దీర్ఘ శరణాగతి అయ్యి ఉండాలి. నీ శాంతి పొట్టి పొట్టిగా ఉండకూడదు, దీర్ఘ శాంతి అయ్యి ఉండాలి, దీర్ఘ శరణాగతి అయ్యి ఉండాలి.

మనం కూడా మధ్య మధ్యలో ఒక రోజు, రెండు రోజులు బాగానే ఉంటాం. నిన్న, మొన్న బాగానే ఉంది ఇవాళ ఏదో తేడా వచ్చేసింది అంటాం చూడండి అలా ఉండకూడదు. మీకు దీర్ఘశాంతి ఉండాలి. మీకు ఆ రియాలిటీ పట్ల ఉండవలసినభక్తి, మీ హృదయంలో ఉన్న నిజం పట్ల ఉండవలసినభక్తి, ఉండవలసిన శ్రద్ధ లేకపోతే, అది కనుక absent అయితే నువ్వు ఫెయిల్ అయిపోతావు అంటున్నారు ఆచార్యులవారు. నీ హృదయంలో ఉన్న సద్వస్తువు మీద నీకు తగిన ప్రేమ లేకపోతే, తగిన విశ్వాసం లేకపోతే, అది ఉందో, లేదో అని మాటిమాటికి అనుమానం వస్తూ ఉంటే, ఉన్నాడు ఉన్నాడు అనుకునే దేవుడు ఉన్నాడో, లేడో అని గంట గంటకి నీకు అనుమానం వస్తుంటే ఇంక నువ్వేమి పొందుతావురా? ఏమీ

**వ్యాపారం చేయటానికి కొంత డబ్బు కావాలి.**
**జ్ఞానం సంపాదించటానికి పెట్టుబడి అవసరం లేదు.**
**'తెలుసుకోవాలి అనే కాంక్ష' ఉంటే సరిపోతుంది.**



పొందలేవు. హృదయంలో ఉన్న సద్వస్తువు మీద నీకున్న భక్తి, నీకున్న ప్రేమ, సజీవంగా కనుక లేకపోతే, నువ్వు తప్పనిసరిగా ఫెయిల్ అవుతావు అంటున్నారు ఆచార్యస్వాములవారు.

ఏది శాశ్వతం? ఏది శాశ్వతం కాదు అనే విభజన మీరు నేర్చుకోవాలి, ఆ విభజన మీకు తెలియాలి. మనిషి పని చెయ్యకుండా ఉండలేడు, పని చేస్తే కర్మఫలం వచ్చేస్తుంది. ఆ ఫలాన్ని నువ్వు ఎంజాయ్ చెయ్యడం మానేయ్. ఎంజాయ్ చేశావా కర్మ నీ ముక్కుని పట్టుకుంటుంది. కర్మఫలం వచ్చినా నువ్వు దానిని పట్టించుకోవద్దు, రాకపోయినా నువ్వు దానిని పట్టించుకోవద్దు. దాని గొడవ వదిలేయ్. కర్మఫలాన్ని ఎంజాయ్ చెయ్యకు, కర్మఫలాన్ని ఎంజాయ్ చేశావా నీకు మోక్షం కలుగదు. శాంతిగా ఉండడం నేర్చుకో, శాంతి కూడా నీ ముఖానికి అలంకారం, జ్ఞానం కూడా నీ ముఖానికి అలంకారం. గౌతమబుద్ధుడు ముఖాన్ని చూసి అనేకమందికి జ్ఞానం కలిగింది. నువ్వు జ్ఞానం సంపాదించు అని గౌతమబుద్ధుడు చెప్పలేదు. ఆయన ముఖాన్ని చూసి అనేకమందికి శాంతి కలిగింది, జ్ఞానం కలిగింది.

రమణమహర్షిగారు ఏమి అన్నారు అంటే మీకు జ్ఞానం లేదు అనుకోండి, శాంతి లేదు అనుకోండి, ఒక పదివేల రూపాయలు చీర కట్టుకున్నారు అనుకోండి, ముఖం నిండా పౌడర్ రాసేసుకున్నారు అనుకోండి, అది ఎలా ఉంటుంది అని చెప్పారు అంటే శవాన్ని అలంకరించినట్టు ఉంటుంది అన్నారు. చచ్చిపోయిన మనిషిని అలంకరిస్తే అందం వస్తుందా? అదేవిధంగా మీకు జ్ఞానం లేనప్పుడు మీ శరీరాన్ని ఎంత అలంకరించుకున్నా ఒక్కటే అన్నారు. అంటే అలంకరించుకోకూడదు అని కాదు, జ్ఞానం లేనప్పుడు ఎన్ని అలంకరించుకున్నా ఒకటి లేని సున్నలు అన్నారు. ఇవాళ మనం బాగా గుర్తు పెట్టుకోవలసింది ఏమిటి అంటే, నువ్వు నడుస్తున్నా, కూర్చున్నా, నువ్వు పూజ చేసుకో, జపం చేసుకో, ధ్యానం చేసుకో, విచారణ చేసుకో, నదుల్లో స్నానాలు చెయ్యి, ఏమి చేస్తున్నా కానీ నీ దృష్టి మటుకు మోక్షం పొందాలి, బ్రహ్మానుభవం పొందాలి, బ్రాహ్మీస్థితి అందుకోవాలి అనే దాని మీదే ఉండాలి. నువ్వు వెళితే తిరుపతి వెళ్ళు, లేకపోతే అరుణాచలం వెళ్ళు, జపం చెయ్యి, ధ్యానం చెయ్యి, విచారణ చెయ్యి, పెద్దలు చెప్పిన మాటలు శ్రవణం చెయ్యి కానీ నీ కాంక్ష అంతా దేనిమీద ఉండాలి అంటే అసత్యంలోంచి విడుదల పొందాలి అనేటటువంటి కాంక్ష మటుకు నీలో ఉండాలి. అది ఉంటే నువ్వు తరిస్తావు.

శ్రద్ధగా శ్రవణం చెయ్యి, విద్యావంతుడివికా, తెలివిగలవాడవికా, మొద్దుఅబ్బాయి లాగా ఉండకు, నువ్వు శ్రద్ధగా శ్రవణం చేసి విద్యావంతుడివి అయితే నీకు సందేహాలు తగ్గిపోతాయి. మాటిమాటికి అనుమానించే స్వభావం పోతుంది. ఉన్నవస్తువుని ఉందా? లేదా? ఉందా? లేదా? అని మాటిమాటికి అనుమానిస్తుంటే నీ లోపలఉన్న ఆ వస్తువు నీకు వ్యక్తం కాదు. అది కృష్ణుడి మాటలో చెప్పాలి అంటే మాటిమాటికి సందేహించేవాడికి ఈ లోకం లేదు, పరలోకం లేదు అన్నాడు గీతలో భగవంతుడు. మాటిమాటికి డౌట్ చేసేవాడికి ఈ లోకంలోనూ సుఖం లేదు, పోనీ ఈ లోకంలో సుఖపడడం లేదు, చచ్చిపోయిన తరువాత సుఖపడతాడు అంటే చచ్చిపోయిన తరువాత కూడా వాడికి సుఖం లేదు. ఏ వస్తువు అయితే అంతటా వ్యాపించి ఉందో దానినే వాడు మాటిమాటికి డౌట్ చేస్తుంటే, వాడికి సుఖం ఏమిటి? వాడికి శాంతి ఏమిటి? వాడికి ఆనందం ఏమిటి? వాడికి happiness లేదు, peace లేదు. ఎవడైతే నీ లోపల ఉండి సందేహిస్తున్నాడో ఆ సందేహించే వాడిని బయటకి లాగి కాల్చి బూడిద చెయ్యి.

కృష్ణుడు గీతలో ఏమి చెప్పాడు అంటే నీలో ఏవైనా పొరపాట్లు ఉన్నా, నీలో ఎవైనా బలహీనతలు ఉన్నా, నీ విశ్వాసం కనుక సజీవంగా ఉంటే, మిమ్మల్ని నేను ఉద్ధరిస్తాను అన్నాడు. ఒకవేళ నిజంగా మీలో ఏవైనా పొరపాట్లు ఉన్నాయి అనుకోండి, భగవంతుడు ఉన్నాడు అన్న విశ్వాసం కనుక wavering లేకుండా సజీవమైన విశ్వాసం మీకు ఉంది అనుకోండి, ఒకరోజు నమ్మకం, ఒకరోజు అపనమ్మకం అలా కాకుండా, భగవంతుడు ఉన్నాడు అనే విశ్వాసం సజీవంగా ఉంది అనుకోండి, మీలో ఏవైనా బలహీనతలు ఉన్నా ఆ బలహీనతలు తీసేసి మిమ్మల్ని శుభ్రంగా కడిగేసి, నా స్వరూపాన్ని మీకు ఇస్తాను, ఎందుకు మీరు అనుమానిస్తున్నారు అన్నాడు గీతలో. నీళ్ళ తోటి మీ శరీరాన్ని ఎలా కడుక్కుంటున్నారో ఆయన అనుగ్రహం తోటి మీ మనస్సుని శుభ్రంగా కడిగి, మీ మనస్సుని పవిత్రం చేసి నా స్వరూపాన్ని మీకు అర్పిస్తాను అన్నాడు మీ విశ్వాసం కనుక సజీవంగా ఉంటే భగవంతుడు ఉన్నాడా? లేడా? అనే సందేహానికి గంటగంటకి మీరు తావు ఇవ్వకూడదు. అంటే జీవనదిలో ఎప్పుడూ నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అలాగే మన విశ్వాసం కూడా దైవాభిముఖంగా ఎప్పుడూ ప్రవహిస్తూ ఉండాలి. Eswara bhakthi should be done by all human beings. ఈ

దేహం చస్తే చావనీ కంగారు లేదు, ఈ శరీరం చచ్చిపోతే కొత్త శరీరం వస్తుంది, కాని భక్తి విడిచిపెట్టకు. ఇంకొక పదిజన్మలు పడితే పడతాయి. ఆభక్తి ఉంది అనుకో ప్రమాదం లేదు, ఎందుచేత అంటే ఈ పదిజన్మల్లో కూడా దాని గురించి కృషి చేస్తాం, నువ్వు పొందవలసింది ఏదో నువ్వు పొందుతావు. గురువు యందు ప్రేమ, ఈశ్వరుడి యందు ప్రేమ, భగవంతుడి యందుభక్తి కలిగి ఉంటే అదనంగా నీకు పదిజన్మలు వచ్చినా నువ్వు కంగారు పడిపోవక్కర్లేదు. Eswara bhakthi should be done by all human beings. భక్తి లేని జన్మ ప్రమాదం కానీ భక్తి కలిగిన జన్మ ప్రమాదం తీసుకురాదు. ఎందుచేత అంటే భక్తి కలిగిన జన్మ ఆ లోపల ఉన్న హృదయగ్రంథిని తెంచేస్తూ ఉంటుంది. భక్తి కనుక నువ్వు పోకుండా చూసుకుంటే అదనంగా నాలుగుజన్మలు వచ్చినా నీకు ఏమి ప్రమాదం లేదు. ఓం నమో నారాయణాయ, ఓం నమో నారాయణాయ, నారాయణాయ, నారాయణాయ.

శంకరాచార్యుల వారి తల్లి గారు ప్రాణం విడిచేటప్పుడు ఆచార్యస్వాములవారు వచ్చి నిరాకార బ్రహ్మం గురించి, నిర్గుణ బ్రహ్మం గురించి చెప్పటం మొదలుపెట్టారు. అప్పుడు తల్లిగారు అన్నారు నేను చావడానికి సిద్ధంగా ఉన్నప్పుడు నువ్వు వచ్చి పురాణాలు చెబుతుంటే నేను ఎక్కడ వింటాను? మహావిష్ణువు యొక్క రూపాన్ని నాకు చూపించు, నా మనస్సుని ఆ రూపం మీద నిలబెట్టి నా ప్రాణాన్ని విడిచిపెడతాను. అలా చెయ్యరా, ఈ పురాణాల గొడవ నేను ఎక్కడ వినగలను? నువ్వు చెప్పడానికి టైము ఉన్నా, నేను వినడానికి టైము లేదు. ఆ విష్ణువు యొక్క రూపాన్ని నాకు చూపించు. నా మనస్సుని ఆ రూపం మీద నిలబెట్టి ప్రాణాన్ని విడిచిపెడతాను అంది ఆచార్యస్వాములవారితోటి. ఆచార్యస్వాములవారు తల్లి చెప్పినట్టే చేశారు. ఆచార్యస్వాములవారు నిరాకారం గురించి మొదలు పెడితే ఆవిడ సాకారంలోకి వెళ్ళింది.

ఆచార్యస్వాములవారికి టీచింగ్ అంటే బాగా ఇష్టం. ఆయన బోర్న్ టీచర్, గ్రేట్ టీచర్, అంటే సబ్జెక్టు చెప్పడంలోనే వాడిని experience లోకి తీసుకుని వచ్చేయాలి అని. ఉదయం స్నానాలు చేసారు అనేటప్పటికి ఇంక పుస్తకాలు తియ్యండి అనేవారు ఆచార్య స్వాములవారు.

**హరహర శంకర జయజయ శంకర హరహర శంకర జయజయ శంకర**



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**ఇంద్రియార్థేషు వైరాగ్యమ్ అనహంకార ఏవచ ।**

**జన్మ మృత్యు జరావ్యాధి - దుఃఖ దోషాను దర్శనమ్ ॥ 13-08 ॥**

**తాత్పర్యము :** ఇంద్రియార్థముల యందు వైరాగ్యము (ఇహపరలోక భోగములన్నింటి యందును ఆసక్తి లేకుండుట), అహంకార రాహిత్యము, జన్మ, మృత్యు, జరా (ముసలితనము) రోగాదులయందు దుఃఖదోషములను పదేపదే దర్శించుట-

**ఇంద్రియార్థేషు వైరాగ్యం** అంటే ఇంద్రియ విషయాలలో ఉన్న దోషం మీకు అర్థం అవ్వాలి ఏ ఇంద్రియం ఏ విషయానికి ఆకర్షించబడుతుందో, ముందు అందులో ఉన్న దోషం అర్థం అవ్వకుండా వైరాగ్యం రాదు, మనసు అంతర్ముఖం అవ్వదు. ఆత్మ చింతన వల్ల ఆత్మజ్ఞానం కలుగుతుంది. విషయ చింతన వల్ల ఇంద్రియాలు బాహ్యంగా విజృంభిస్తాయి. భగవంతుడు

యొక్క రసానుభూతిలో, ఆత్మ శాంతిలో, ఆత్మజ్ఞానంలో, ఇంద్రియాలు, మనస్సు లయం అవ్వాలి, అదే తపస్సు యొక్క ప్రయోజనం. "మీ మనస్సుని ఆగమంటే ఆగడం లేదు, నా మనస్సుని కదలమంటే కదలడం లేదు" అనేవారు భగవాన్. అంటే, ఆత్మజ్ఞానంలో, ఆత్మశాంతిలో, కనెక్షన్ ఉండడం వల్ల, ఆయన మనస్సు ఇంక చెదరదు. ఇంద్రియ విషయాలలో ఉన్న లోపం మీకు అర్థం అయితేనే కానీ మీ మనస్సు అందులోంచి ఉపసంహరించబడదు.

**అనహంకార ఏవచ** అహంకారం లేకుండా ఉండడం. అహంకారం అంటే కోపం కాదు, నువ్వు ఏది కాదో అది అవును అనుకోవడం అహంకారం. మనం ఆత్మ, మనం చైతన్యం. కానీ మనం దేహం అనుకుంటున్నాం. దేహమే సత్యం అనుకుంటున్నాం, దేహాన్ని ఆత్మ అనుకుంటున్నాము, అదే అహంకారం. అహంకారం అనేది ఒక తలంపు. మనకి కొన్ని వేలాది తలంపులు ఉన్నాయి, అందులో అహంకారమనేది ప్రథమ తలంపు, ప్రధాన తలంపు. అహంకారమనే మొదటి తలంపుకి కోపమనే ఇంకొక తలంపు వస్తుంది. తన అస్థిత్వాన్ని దేహానికే పరిమితం చేసుకునే ప్రతీవాడు అహంకారే. దేహం పుట్టినప్పుడు మనం పుట్టాం అనుకుంటున్నాం. దేహం మరణించినప్పుడు మనం మరణించాం అనుకుంటున్నాం. కానీ నువ్వు ఆత్మవి. దానికి పుట్టుక లేదు, చావు లేదు. ఆ చావులేని స్థితి యొక్క వైభవం, దాని ఔన్నత్యం మనకి సూచనప్రాయంగా అయినా అర్థం అయితే, అప్పుడు విషయాలని త్యాగం చెయ్యాలి అనే బుద్ధి కలుగుతుంది. కానీ ఆ స్థితి గురించి అవగాహన లేకపోతే, ఎవడూ విషయాలను త్యాగం చెయ్యలేడు.

దేహానికి పరిమితం అయిన బుద్ధిని విడిచి పెట్టడమే అహంకారం లేకుండా ఉండడం. పరిమితులు ఎప్పుడైతే వచ్చాయో ఆ పరిమితులు లోంచే అంతులేని దుఃఖం వస్తుంది. దానిని నువ్వు ఉపాసన, భక్తి, ధ్యానం, ఏదో ఒక ప్రక్రియ ద్వారా విడిచిపెట్టు. ఎప్పుడైతే అహంకారాన్ని విడిచి పెట్టావో అప్పుడు నీకు అనహంకార స్థితి వస్తుంది. అక్కడ నీకు సత్యం వ్యక్తం అవుతుంది. ఎంత అధికారం, సంపద ఉన్నప్పటికీ, అనహంకార స్థితికి

వెళితేనే కానీ సత్యం అనుభవంలోకి రాదు. ఈ అనహంకార స్థితిని పొందడం కోసమే పూర్వం అనేకమంది మహారాజులు రాజ్యం సంపదలు త్యాగం చేశారు.

శరీరం ధరించి ఉన్నా కూడా తాను శరీర మాత్రుడిని కాదు అన్న సంగతి కృష్ణుడికి తెలుస్తూ ఉంటుంది. నేను శరీరం కాకపోయినా నన్ను శరీరానికి పరిమితం చేసి లోకం నన్ను అవమానం చేస్తోంది అన్నాడు కృష్ణుడు. అంటే దేవుడి యొక్క కర్మ, దేవుడి యొక్క జన్మ మనకి అర్థం కాదు. అర్థం చేసుకునే శక్తి మన అహంభావనకి లేదు. భగవద్గీతలో దేవుడు చెప్పిన మాటలు మనకి నచ్చకపోతే ఊరుకోము, నువ్వు చెప్పింది నాకు నచ్చడం లేదు, నేను చెప్పినట్టు నువ్వు విను అంటాం దేవుడిని. అహంభావంలో అంత మాయ ఉంటుంది. భగవంతుడు మొత్తం మాయ అంతటిని తీసుకొచ్చి అహంభావనలో పెట్టేశాడు. ఇంక భగవంతుడు చెప్పిన మాటలు అహంభావనకి ఎలా నచ్చుతాయి?

**జన్మ మృత్యు జరావ్యాధి - దుఃఖ దోషాను దర్శనమ్** - అంటే జన్మలో, మృత్యువులో, ముసలితనంలో, వ్యాధిలో, వీటన్నిటిలో ఉన్న దుఃఖాలు, దోషాలను చూడగలగాలి, దర్శనం చెయ్యాలి. శరీరం పుట్టింది అంటే కుటుంబం వస్తుంది, రోగం వస్తుంది, ముసలితనం వస్తుంది, తరువాత చచ్చిపోతుంది. శరీరం అంటూ వస్తే నువ్వు దుఃఖం నుండి తప్పించుకోలేవు అని చెపుతున్నాడు కృష్ణుడు. పుట్టుక, చావు, రోగం, ముసలితనం, ఇవన్నీ బాధామయమే. ఇదంతా దుఃఖాలయమే, శరీరం కూడా దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. అందుచేత జన్మ, రోగం, ముసలితనంలో ఉన్న దోషాలు, శరీరానికి సంబంధించిన అటాచ్మెంటులో ఉన్న దోషాలు, నువ్వు దీర్ఘదృష్టితో అలోచించి, అందులో ఉన్న దోషాలను గ్రహించి, శరీరం రాకుండా చేసుకునే స్థితి, అంటే మోక్షస్థితి నువ్వు పొందడానికి ప్రయత్నం చేసుకో అర్జునా!దేహం కోసం విలపించకు. దేహం వచ్చింది అంటే అన్ని అరిష్టాలు వచ్చేస్తాయి. అందులో ఉన్న దోషాలు నువ్వు గ్రహిస్తే ఆ దోషాల నుండి బయటపడడానికి నువ్వు ప్రయత్నం చేస్తావు కానీ అందులోని దోషమే నీకు తెలియనప్పుడు అందులోంచి బయటకు రావడానికి ప్రయత్నం చెయ్యవు అర్జునా అని చెబుతున్నాడు.



బుద్ధ పౌర్ణమి సందర్భంగా అరుణాచల దీపం

శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు

# ఆధ్యాత్మిక విద్య

మసక చీకటిలో మనము త్రాడును చూసి పాముగా భ్రమపడతాము. తద్వారా మనకు భయము, దుఃఖము కలుగుతాయి. తరువాత ఒక దీపము సహాయముతో దానిని సమీపించి విచారణ చేసినప్పుడు, అది త్రాడు అన్న సత్యము తెలియగానే భ్రాంతి తొలగి భయము, దుఃఖము తొలగిపోతాయి. అలాగే కేవలం పరబ్రహ్మము మాత్రమే ఆదిమధ్యాంతర రహితంగా ఉంది. కల్పిత అజ్ఞానము వల్ల బ్రహ్మము స్థానే జగత్తు గోచరించి, దాని ఫలితంగా దుఃఖము, భయము మరియు ఇతర వికారములు కలుగుతాయి. గురుప్రబోధ ఫలితమైన ఆత్మజ్ఞానమనే వెలుగు సహాయంతో పరమ సత్యాన్ని తెలుసుకున్న క్షణంలో, సచ్చిదానంద స్వరూపమైన పరమాత్మ తానేనని అనుభవమవుతుంది. అప్పుడు భయానికి, దుఃఖానికి కారణమైన జగత్తు పరమాత్మకంటే వేరుగా ఉన్నదనే భ్రాంతి తొలగిపోతుంది. జగత్తు ఆత్మకంటే వేరుగా ఉన్నదనే భ్రాంతి తొలగిపోతుంది. జగజ్జీవేశ్వర అభిన్నత్వం సిద్ధిస్తుంది. ఆకాశము నుండి పుట్టిన వాయువు ఆకాశాన్ని ఏమీ ప్రభావితం చేయలేనట్లు, ఆత్మ నుండి పుట్టిన మనస్సు ఆత్మను ఏమీ ప్రభావితం చేయలేదు. "ఏకం సత్ విప్రాబహుదా వదన్తి" అని ఋగ్వేదం వచిస్తోంది. పరమార్ధ వస్తువు ఒక్కటే, అది అద్వితీయం, బుధజనులు ఆ సద్వస్తువునే వేరు వేరు పేర్లతో పిలుస్తున్నారు. భౌతిక విద్యలు వల్ల ఆకలి దప్పికలు తీర్చుకోవచ్చు కానీ పరమశాంతికోసం, పునరావృత్తి రాహిత్యం కోసం ఆధ్యాత్మిక విద్యను నేర్వవలసిందే, వాస్తవంగా తానెవరో తెలుసుకోవలసిందే. అందువల్లే చదువవలెను.... చదువవలెను... చావులేని చదువు చదువవలెను... అన్నాడు ప్రహ్లాదుడు. దేనిని తెలుసుకోవడం వల్ల తెలియనిదంతా తెలియబడుతోందో అదే ఆత్మ. అట్టి ఆత్మను తానుగా తెలుసుకుంటే, ఇక తెలుసుకోవలసింది ఏమీ ఉండదు. ఆత్మ నిర్వికారము, అమృతము అదే - సర్వుల స్వరూపం. అట్టి ఆత్మే సద్గురుని యొక్క నిజతత్త్వం. జీవునికి తన నిజతత్త్వాన్ని ఎరుకపరచడానికే పరబ్రహ్మమే, గురురూపంలో మనకు బోధిస్తుంది. అట్టి గురువాక్యము మనకు ప్రమాణసిద్ధము. సముద్రం చేరాక నదికి ప్రవాహము ఆగినట్లే, మనస్సును హృదయంలో విలీనం చేస్తే తాను అమృతుడు అవుతాడు, సచ్చిదానంద స్వరూపుడు అవుతాడు.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**